క్లుప్తంగా

నేటి నుంచి టీకాలు

కామేపల్లి/ఖమ్మంరూరల్: నేటి నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయనున్నట్లు కామేపల్లి, ఖమ్మంరూరల్ మండలాల పశువైద్యాధికారులు జి.గోపీకృష్ణ, హరీష్‌లు తెలిపారు.ఆయా గ్రామాల్లోని రైతులు పశువులకు తప్పకుండా టీకాలను వేయించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

రఘునాథపాలెం: వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యురాలు దుర్గాభవాని అన్నారు. గురువారం మంచుకొండ పీహెచ్‌సీ పరిధిలోని వేపకుంట్ల గ్రామంలో ఇంటింటి సీజనల్ వ్యాధుల సర్వే నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ మేరకు వైద్య శిబిరం ఏర్పాటు చేసి జ్వరాలు, ఇతర వ్యాధుల వారిని పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వైద్య పర్యవేక్షకుడు జి.నర్సయ్య, ఎంపీహెచ్ఎ(ఎఫ్) మేడా పుష్పావతి, ఆశ కార్యకర్తలు ప్రమీల, సునీత తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయిస్తేనే ఆర్థికాభివృద్ధి

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఇతర ఓసీ కులాల్లో జానాభా, ఆర్థిక ప్రాతిపదికన కార్పొరేషన్లకు నిధులు కేటాయిస్తే ఆయా కులాల్లోని పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని బీఆర్ అంబేడ్కర్ ప్రజాసంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాల, మాదిగ, ఇతర కులాలకు 16 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



గోపాలపురంలో శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ

తిరుమలాయపాలెం: మండలంలోని ఎర్రగడ్డ శివారు గోపాలపురం, కొక్కిరేణి, తాళ్లచెరువు గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మండల జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కొక్కిరేణి ఎంపీటీసీ అంబేడ్కర్, ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని బోనకల్ రోడ్‌లో గల దుర్గా భవానీ ఆశ్రమంలోని వృద్ధులకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యాన గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ డాక్టర్ డీపీసీ రావు మనువడు సాయి రినీశ్ పుట్టనరోజు సందర్భంగా అందించిన ఆర్థిక సాయంతో వృద్ధులకు ఒక రోజు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు టి.కృష్ణారెడ్డి, కార్యదర్శి వి.హనుమంతరావు, డాక్టర్ డీపీసీ రావు, అత్తలూరి గోవర్ధన్, అహోపా కృష్ణమూర్తి, మేకా దుర్గానాగేశ్వరరావు, సోమశేఖర్, వి.వెంకయ్య, ఆశ్రమ నిర్వాహకుడు బండారు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ప్రేమలు
వినోద	గామీ
సాయిరాం	తంత్ర, పరతులు వర్తిస్తాయి
ఆదిత్య	రజాకార్
శ్రీనివాస	భీమా
సుందర్	వెయ్యి, దరువెయ్యి

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	3
వంకాయ	26		20
బెండకాయ	26	పాలకూర	3
పచ్చిమిర్చి	34		20
కాకర	36	చుక్కకూర	3
బీర	40		20
దొండ	24	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	110	గోంగూర	2
గోరుచిక్కుడు	46		10
క్యాబేజీ	28	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	28	కొత్తిమీర	1
చామగడ్డ	60		30
క్యారెట్	36	పుదీన	1
క్యాప్సికం	60		20

-ఖమ్మం వ్యవసాయం

కేఎంసీలో.. విజిలెన్స్ దడ!



రోడ్డు నుంచి కోర్ కట్ చేస్తున్న శాంపిల్ (ఫైల్)

ముమ్మరంగా రోడ్ల తనిఖీలు
- కోర్ కట్ చేసి శాంపిళ్ల సేకరణ
- ల్యాబ్‌కు పంపించిన విజిలెన్స్ అధికారులు
- కేఎంసీ ఇంజనీరింగ్ అధికారుల్లో గుబులు
- ఎంబీల్లో చేతిరాతల తేడాపై అసహనం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే రికార్డుల పరిశీలన పూర్తి చేసిన అధికారులు.. క్షేత్రస్థాయిలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. నగరంలో పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు సంబంధించి రికార్డుల ప్రకారం ఉన్నాయా..? లేదా..? పరిశీలించారు. ఇక కోర్ కట్ చేసి శాంపిళ్లను సేకరించారు. ఎంపిక చేసిన పనుల వద్ద శాంపిళ్లు సేకరించడంతో కేఎంసీ ఇంజనీరింగ్ అధికారుల్లో గుబులు మొదలైంది. ఇప్పటికే రికార్డులను స్వాధీనం చేసుకున్న అధికారులు, తాజాగా పనులకు సంబంధించిన శాంపిళ్లను సేకరించడంతో అధికారుల్లో ఆందోళన కనిపిస్తుందని కేఎంసీలో చర్చ జరుగుతుంది.

శాంపిళ్ల సేకరణ..

గత ప్రభుత్వ హయాంలో నగరంలో జరిగిన పనులపై అనేక ఆరోపణలు రావడం, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు అందడంతో గత నెల 28న వరంగల్ నుంచి విజిలెన్స్ అధికారుల బృందం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకుంది. కార్యాలయంలో మూడు రోజుల పాటు పలు రికార్డులను పరిశీలించి, ఎంపిక చేసిన పనులకు సంబంధించిన రికార్డులను అధికారులు తీసుకెళ్లారు. తాజాగా రెండు రోజుల పాటు మరోసారి ఖమ్మం నగరంలో క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. కేఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి డివిజన్లలో పర్యటిస్తూ రోడ్ల కొలతలు రికార్డుల ప్రకారం ఉన్నాయా..? లేదా? అని పరిశీలించారు. రోడ్ల నుంచి కోర్ కట్ చేసి కొలతలు వేశారు. ఇక రోడ్డు నుంచి కట్ చేసిన వాటిని నాణ్యత పరిశీలనకు హైదరాబాద్ ల్యాబ్‌కు తరలించినట్లు తెలిసింది.

రాతల్లో తేడాపై అసహనం..

క్షేత్రస్థాయిలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న సమయాన విజిలెన్స్ అధికారులు ఎంబీలను ఆధారంగా చేసుకొని రోడ్ల కొలతలను వేశారు. ఈ సమయాన ఎంబీలను పరిశీలించిన అధికారులు వాటిల్లో పలు రకాల చేతి రాతలు ఉండడాన్ని గమనించి అధికారులపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇంజనీర్లు రాయాల్సిన ఎంబీలను ఎవరి చేత రాయించారంటూ అధికారులను ప్రశ్నించినట్లు సమాచారం. వర్క్ ఇన్‌స్పెక్టర్లతో ఎంబీలు ఎలా రాయించారని ఏఈలను విజిలెన్స్ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. రికార్డుల పరిశీలనలో కేఎంసీ ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని ఈ సందర్భంగా కార్యాలయంలో చర్చ జరగడం గమనార్హం.

అధికారుల్లో ఆందోళన..

సుడా, ఎస్‌డీఎఫ్, జనరల్‌ఫండ్ ఇలా పలు రకాల నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి విజిలెన్స్ అధికారులు తనిఖీలు ముమ్మరం కావడంతో ఇంజనీరింగ్ అధికారుల్లో భయాందోళన మొదలైందనే చర్చ కేఎంసీలో జరుగుతుంది. గత నెల 28న రికార్డులు పరిశీలించిన అధికారులు వారం పది రోజుల్లోనే మరోసారి ఖమ్మం వచ్చి క్షేత్రస్థాయిలో పనుల కొలతలు, రోడ్ల కోర్ కట్ చేసిన శాంపిళ్లను హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించి త్వరగా నివేదికలను తెప్పించుకునేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిసింది. అధికారుల తనిఖీలు వేగంగా జరుగుతుండడంతో అధికారుల్లో కొంత భయం మొదలైనట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. విజిలెన్స్ నివేదికలు వచ్చిన తర్వాత తమ పరిస్థితి ఏంటని, పనుల నాణ్యత ఫలితాలు ఎలా ఉంటాయో అనే చర్చ అధికారుల్లో సైతం జరుగుతుందని తెలిసింది.

మహిళలపై పెరిగిన వివక్ష..



సమావేశంలో మాట్లాడుతున్న లతాదేవి

రఘునాథపాలెం: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడిచినా మహిళలపై వివక్ష వీడడం లేదని, బీజేపీ పాలనలో మరింత పెరిగిందని తెలంగాణ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి లతాదేవి ఆరోపించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా గురువారం మండల పరిధిలోని పువ్వాడనగర్‌లో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి మహిళా సమాఖ్య పతాకాన్ని ఆవిష్కరించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్ ఒక ప్రహసనంగా మారాయని దానిని కూడా రాజకీయాలకు ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. మహిళలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ ఉన్నప్పటికీ పదవుల్లో ఉన్న మహిళలను కాదని పురుషాధిక్యతను ప్రదర్శిస్తున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం మహిళలకు సంబంధించిన గ్యాస్ నేరుగా రూ.500లకే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని మహాలక్ష్మి పథకంలో భాగంగా నగదు బదిలీ పథకాన్ని ఏప్రిల్ నుంచి అమలు చేయాలని కోరారు. నాగమణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షురాలు తాటి నిర్మల, నాయకులు రాంబాయి, వినోద, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన జేఏసీ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సుధాకర్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఖమ్మం జిల్లా ఉద్యోగుల సంఘాల జేఏసీ ఆధ్వర్యాన గురువారం కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభిను కలిశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధుల అండదండలతో కొంతమంది ఉద్యోగులు సుధాకర్‌ను ఇక్కడ నుంచి పంపించేందుకు కుట్రలు చేశారని, ప్రభుత్వం ఆయనను తిరిగి కేఎంసీకి బదిలీ చేసినా ఇక్కడకు రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కేఎంసీలో పెత్తనం చెలాయించే ఉద్యోగుల అక్రమాలపై జిల్లా మంత్రుల దృష్టికి తీసుకెళ్తామని, ఇకనైనా వారి పద్ధతి మార్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ నాయకులు కొనెదన శ్రీనివాస్, గుంటుపల్లి శ్రీనివాస్, జైపాల్, దుర్గాప్రసాద్, గంగవరపు బాలకృష్ణ, శ్రీకాంత్, హరికృష్ణ, కృష్ణ, వంశీ, చంద్రశేఖర్, ప్రకాశ్, వెంకట్రావు, పంచాయతీరాజ్ ఉద్యోగ సంఘ నాయకులు మామునూరి రాజేశ్, రమేశ్, వేణుగోపాల్, డ్రైవర్ల సంఘం నాయకులు కోటేశ్వరరావు, వేణుగోపాల్, వెంకట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాలలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆర్థిక సాయం అందించారు. మండలంలోని గువ్వలగూడెం, కోనాయిగూడెం, ఆచార్లగూడెం, కోరట్లగూడెం తదితర గ్రామాలలో బాధితుల కుటుంబాలను పరామర్శించి మృతుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పొంగులేటి అందించిన సాయాన్ని పార్టీ నాయకులు బాధిత కుటుంబాలకు అందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేశ్, డి.శ్రీనివాసరెడ్డి, నెల్లూరి భద్రయ్య, వెన్నపూసల సీతారాములు, మైశా శంకర్, వెంకన్న, బొందయ్య, బచ్చలకూరి నాగరాజు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

'కేంద్రంలో మళ్లీ బీజేపీదే అధికారం..'

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్రంలో మూడోసారి కూడా బీజేపీని గెలిపించి నరేంద్రమోదీని ప్రధానిగా చేయాల్సిన అవసరముందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అన్నారు. బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ నిర్వహిస్తున్న ప్రజాహిత యాత్రలో పాల్గొనేందుకు గురువారం ఖమ్మం నుంచి బీజేపీ నాయకులు బయలుదేరారు. ఈ సందర్భంగా వాహనాలను గల్లా ప్రారంభించి మాట్లాడుతూ ఖమ్మం లోక్‌సభ సీటు ఎవరికి ఇచ్చినా గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంరాథోడ్, నాయకులు మార్తి వీరభద్రప్రసాద్, వెంకటనారాయణ యాదవ్, అల్లిక అంజయ్య, వీరంరాజు, మంద సరస్వతి, గుత్తా వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, నరేశ్, రాఘవరావు, వీరభద్రం, కిరణ్, పాల్గొన్నారు.

కార్ల్‌మార్క్స్ వర్ధంతి..

ఖమ్మంమయూరిసెంటర్/ కూసుమంచి: ప్రపంచ పీడిత ప్రజల విముక్తి సిద్ధాంత కర్త కార్ల్‌మార్క్స్ వర్ధంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. గురువారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యాన, కూసుమంచిలో ఇఫ్టూ కార్మిక సంఘాల ఆధ్వర్యాన నాయకులు కార్ల్‌మార్క్స్' చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సిద్ధాంతాలను అనుసరించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, సీవై పుల్లయ్య, జి.రామయ్య, ఆవుల అశోక్, కె.నాగేశ్వరరావు, శిరోమణి, ఝాన్సీ, లాల్మియా, శ్రీను, కార్మిక సంఘ, న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు ఐ.వెంకన్న, బజ్జూరి వెంకట్రామిరెడ్డి, సైదులు, వీరనాగులు, సుభాన్, పటేల్, నాగేశ్వరరావు, జాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంమయూరిసెంటర్: నివాళులర్పిస్తున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు

'ప్రియమైన అమ్మకు' పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న నాగరాజు,తదితరులు

ఖమ్మం సహకారనగర్: తెలుగు ఉపాధ్యాయులు, బాలసాహితీ వేత్త సయ్యద్‌షఫీ సంపాదకత్వంలో 14 మంది విద్యార్థులు రాసిన ప్రియమైన అమ్మతో పుస్తకాన్ని నగరంలోని మోమినాన్ పాఠశాల హెచ్‌ఎం కదలి నాగరాజు ఆవిష్కరించారు. గురువారం పుస్తకావిష్కరణ అనంతరం ఆయన మాట్లాడుతూ.. తల్లి గొప్పదనం తెలుసుకొని అద్భుతమైన లేఖలు రాసిన విద్యార్థులు భవిష్యత్తు రచయితలు కావాలని, నైతిక విలువలు పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యలమద్ది వెంకటేశ్వర్లు, సువర్ణ, సీతారామారావు, దేవయ్య, రమణ, రజిని, షరీఫ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

కవి వీరబాబుకు అవార్డు

నేలకొండపల్లి: మండలంలోని అనాసాగారం మాజీ సర్పంచ్, కవి చిలకబత్తిని వీరబాబు అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లో ఆర్.కే.ఫౌండేషన్ ఆధ్వర్యాన ఇటీవల ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో ప్రతిభ కనబర్చిన ఆయనకు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా గురువారం ఆయనను అనాసాగరంలో పలువురు సన్మానించారు.

'ప్రియదర్శిని' విద్యార్థుల ప్రతిభ

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలో గల ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఉద్యోగ నియామకాల్లో 52 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికై నట్లు కళాశాల చైర్మన్ కె.నవీన్‌బాబు తెలిపారు. బెంగుళూర్‌కు చెందిన కొడ్నేస్ టెక్నాలజీస్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూల్లో వీరు ఎంపిక కాగా గురువారం కళాశాలలో కళాశాల యాజమాన్యం అభినందించింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులకు సాంకేతిక నైపుణ్యాలను నేర్చుకోవడానికి తర్ఫీదు నివ్వడంతో పాటు ఉద్యోగం పొందడానికి ఇంటర్న్‌షిప్ చేయడం ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్, అకడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటనారాయణ, వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

కామేపల్లి: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ రవీందర్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారులతో ఆయన మాట్లాడారు. తాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై వారితో చర్చించారు. తాగునీటి సమస్యకు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు సతీశ్, వరప్రసాద్, తారాదేవి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ఎదుట నిరుద్యోగుల నిరసన



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: ఉద్యోగ నియామకాల్లో సమస్యలను పరిష్కరించాలని, సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లో నిరుద్యోగుల పక్షాన దీక్ష నిర్వహిస్తున్న అశోక్(పోటీ పరీక్షల నిర్వహణ కేంద్రం నిర్వాహకుడు, ట్యూటర్)కు మద్దతుగా నిరుద్యోగులు గురువారం ఖమ్మం కేంద్ర గ్రంథాలయ వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. గురుకుల రిక్రూట్‌మెంట్‌లో డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ అవరోహణ క్రమాన్ని పాటించకపోవడం వల్ల, గురుకుల బోర్డు కామన్ పేపర్లతో పరీక్ష నిర్వహించడంతో 3 వేల మంది గురుకుల అభ్యర్థులు నష్టపోయారని ఆరోపించారు. గురుకుల నియామకాలు అనేక అమానాలకు తావిస్తున్నాయని, వాటన్నింటినీ నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీ కంటే ముందుగా టెట్ నిర్వహించాలని, డీఎస్సీ పోస్టులతో పాటు గ్రూప్ 2, 3లకు సంబంధించిన పోస్టులను పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రణాళికతో జాబ్ కాలెండర్‌ను విడుదల చేసి ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగులు పోరల్ల నాగరాజు, కోటేశ్వరరావు, జయరాజు, సూర్యకళ, షేక్ ఆశ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

భైరవునిపల్లి మత్స్య సొసైటీలో విచారణ



విచారణ చేస్తున్న అధికారి అవినాశ్

నేలకొండపల్లి: మండలంలోని భైరవునిపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో ఇరువర్గాల ఫిర్యాదులపై గురువారం విచారణ చేపట్టారు. సొసైటీ అధ్యక్షుడు మల్లెబోయిన సైదులు గత పాలకులపై చేసిన పలు ఆరోపణలపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా మాజీ అధ్యక్షుడు నూక హనుమంతరావు తనకు అన్యాయం చేశారని, ప్రస్తుత పాలకులపై న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ మేరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్.అవినాష్‌ను విచారణాధికారిగా స్థానిక పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. కాగా, ఇరువర్గాలకు చెందిన గత, ప్రస్తుత పాలకులు పోటీలు పడి విచారణకు హాజరుకావడంతో ఒకరిపై ఒకరు పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. దీంతో మత్స్యశాఖ అధికారులు కలుగజేసుకొని ఇరువర్గాల వారి నుంచి విడివిడిగా ఆధారాలను సేకరించారు. అనంతరం పూర్తి ఆధారాలు అందించాలని ఇరువర్గాల వారిని విచారణాధికారి ఆదేశించి మరోమారు విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా మత్స్యశాఖ అధికారి డి.ఆంజనేయస్వామి, సొసైటీ పాలకవర్గ డైరెక్టర్లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో సెమినార్

ఖమ్మంరూరల్: మండలంలోని కోదాడ క్రాస్‌రోడ్‌లో గల గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం కొబ్బరి పీచుతో ఎలాంటి వస్తువులు తయారి, వేస్ట్ మేనేజ్‌మెంట్ అంశాలపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేరళ నుంచి కాయ్యిర్ ఇండస్ట్రీ ఇన్ కొలాబొరేషన్ విత్ ద క్వాయిర్ బోర్డు మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్ఎంఈ గవర్నమెంట్ ఆఫ్ ఇండియాకు చెందిన డాక్టర్ వివేక్ మాట్లాడుతూ.. కొబ్బరి పీచు పరిశ్రమ స్థాపించడానికి, మార్కెటింగ్ చేయడానికి, లోన్ సౌకర్యాల గురించి వివరించారు. అనంతరం కొబ్బరి పీచుతో తయారైన వస్తువులను ప్రదర్శించారు. ఈ సంస్థ కళాశాలకు ఎంఓయూ ఇంటర్న్‌షిప్, ట్రెనింగ్ సౌకర్యాలను కల్పించారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఝాన్సిరాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

నేలకొండపల్లి: పల్లెల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేశ్ అన్నారు. గురువారం మండలంలోని గువ్వలగూడెంలో రూ.2.50 లక్షలతో నిర్మించనున్న తాగునీటి పైపులైన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత నాలుగేళ్లగా తాగునీటి కోసం గ్రామంలోని దళిత కాలనీల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యాన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లగా.. వెంటనే నిధులు మంజూరు చేయించారని అన్నారు. సమస్యల పరిష్కారం దిశగా మంత్రి పాలేరుపై ప్రత్యేక దృష్టి సారించారని, ప్రభుత్వం అందించే పథకాలను ప్రజలలోకి విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వంగూరి ఉష, గ్రామ పెద్దలు ఈశ్వరప్రగడ రంగారావు, జిల్లపల్లి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ లిక్కి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ ఏనాడు చెప్పకపోయినా.. ఆర్యవైశ్యులపై ఆ పార్టీ చిత్తశుద్ధిని ప్రదర్శించిందని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పులిపాటి ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వంద రోజుల్లోనే ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు కోసం 2014 ఎన్నికల నాటి నుంచి తాము ప్రభుత్వంతో పోరాడుతున్నామని, గత ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టి కూడా హామీని అమలు చేయలేదని అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇవ్వకుండానే ఆర్యవైశ్యుల కోరికను నెరవేర్చిందని, ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మహాసభ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంను కలిసిన వాసవీ క్లబ్ ప్రతినిధులు



సీఎంను సన్మానిస్తున్న క్లబ్ ప్రతినిధులు

నేలకొండపల్లి: ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం రాత్రి హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిను వాసవీ క్లబ్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధికార ప్రతినిధి కల్వ సుజాత ఆధ్వర్యాన ఖమ్మం ఉమ్మడి జిల్లా వాసవీ క్లబ్ ప్రతినిధులు, వర్తక సంఘం బాధ్యులు సీఎంను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు రేగూరి వాసవి, దోసపాటి కల్పన, రేగూరి హనుమంతరావు, దోసపాటి శేఖర్, కొత్తా కరుణ తదితరులు పాల్గొన్నారు.

'దోనెపల్లి' ఆశయ సాధనకు కృషి చేయాలి

తిరుమలాయపాలెం: సీపీఎం జిల్లా నాయకుడు దోనెపల్లి వెంకన్న ఆశయ సాధనకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎర్ర శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మండలంలోని జూపెడలో నిర్వహించిన వెంకన్న రెండో వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వెంకన్న స్మారక స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన మరణం పార్టీకి తీరని లోటని, ఆయన ఆశయ సాధనకు కార్యకర్తలను కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, అంగిరేకుల నరసయ్య, బింగి రమేశ్, వీరన్న, కోట ఉపేందర్‌రెడ్డి, గండుమల్ల ఉపేందర్, సిద్దుల వెంకన్న, కృష్ణారెడ్డి, యశోద, చైతన్య, నాగమణి, దోనెపల్లి వినయ్ పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ఖమ్మంరూరల్: మండలంలోని మంగళగూడెం ఉన్నత పాఠశాల వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జైళ్ల శాఖ మాజీ అధికారి ఖాదర్‌బాబు మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలని ఆందోళన చెందకుండా మంచి వాతావరణంలో ఏకాగ్రతతో రాస్తే మంచి ఫలితాలుంటాయని పేర్కొన్నారు. కాగా, కాంపాటి చలపతి పాఠశాల ఆటస్థలానికి రూ. లక్ష విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాస్, వై.వెంకటేశ్వర్లు, కె.నర్సింహారావు, రమేశ్, రవి, వెంకటయ్య, నర్సయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



ఖమ్మంఅర్బన్: విద్యార్థికి పరీక్ష సామగ్రి అందజేస్తున్న పీఎస్‌ఆర్ బాధ్యులు

రఘునాథపాలెం/ఖమ్మంఅర్బన్/తిరుమలాయపాలెం: విద్యార్థులు చదువుల్లో ఉన్నతస్థాయికి ఎదగాలని పలువురు వక్తలు అన్నారు. గురువారం రఘునాథపాలెం, ఖమ్మం అర్బన్, తిరుమలాయపాలెం మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్సెస్సీ విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు, వార్షికోత్సవ వేడుకల్లో వారు మాట్లాడారు. రఘునాథపాలెంతో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో రఘునాథపాలెం సొసైటీ అధ్యక్షుడు తాతా రఘురాం, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు. అలాగే ఖమ్మం నగరంలోని ఇందిరానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన 60 మంది విద్యార్థులకు చైర్మన్ పరిశ పుల్లయ్య పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. అంతేకాక తిరుమలాయపాలెం మండలంలోని బచ్చోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలలో జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల హెచ్‌లు, ఉపాధ్యాయులు , విద్యార్థులు , నాయకులు పాల్గొన్నారు.